క్లుప్తంగా

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ సోయం

ఇంద్రవెల్లి: అనారోగ్యంతో ఏఎంసీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోమసే వెంకట్‌రావ్ మృతి చెందడం బాధాకరమని మాజీ ఎంపీ సోయం బాపురావ్ అన్నారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకట్‌రావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మీర్జా యాకుబ్‌బేగ్, సోయం రాందాస్ ఉన్నారు.

గజ్జ ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మచ్చ వంశస్తులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పాత ఎస్సీకాలనీకి చెందిన మచ్చ వంశస్తులు మంగళవారం ఇచ్చోడ శివారంలో గజ్జ ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఏటా వేసవిలో ఉగాది పండుగకు వారం ముందు గజ్జ ఎల్లమ్మకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కుల పెద్దలు తెలిపారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



బోరుబావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మండలంలోని బుద్దికొండ, రాజుల తండా, బొందిడి గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో బోరుబావులు, మోటార్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేయని బోరుబావులకు మరమ్మతు చేయించనున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ఎంపీవో లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్

తలమడుగు: తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్ ప్రారంభించారు. తహసీల్దార్ రాజ్‌మోహన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ రోహిదాస్, సిబ్బంది సాయి, హరీశ్, రైతులు ప్రేంసాగర్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

బోథ్: సొనాల మండల కేంద్రంలో రూ.4 లక్షలతో నిర్మించ తలపెట్టిన రోడ్డు పనులను బీజేపీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఎంపీ గోడం నగేశ్.. బోథ్, సొనాల మండలాలకు ఈజీఎస్‌లో భాగంగా రూ. 61 లక్షల పనులు కేటాయించినట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు బోరె రవీందర్, మాజీ మండల అధ్యక్షుడు సుభాష్ సూర్య, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, హరీశ్, పోతన్న, బాశెట్టి రమేశ్, గంగాధర్, శ్రీకాంత్, కాలనీవాసులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో స్కావెంజర్ల నుంచి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌సీడీఓ సునీతకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి 28లోగా జిల్లా దళిత అభివృద్ధి శాఖ కార్యాలయంలో పనివేళల్లో దరఖాస్తులు అందించాలని సూచించారు. అనంతరం వారి అర్హతను బట్టి కలెక్టర్ అధ్యక్షతన ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9440628538 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బ్యాంక్ వివరాలు సమర్పించాలి

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు బ్యాంక్ వివరాలు సమర్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు ఓ ప్రకటనలో తెలిపారు. పాస్‌బుక్ కాపీతోపాటు బ్యాంక్ వివరాలను ఈనెల 27లోగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుందన్నారు. కళాశాలల లెటర్‌హెడ్‌పై అకౌంట్స్ వివరాలతోపాటు స్టేట్‌మెంట్ కాపీని జతచేసి బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నిరుపయోగంగా గ్రంథాలయం



తాంసి గ్రంథాలయం

- రెగ్యులర్ లైబ్రేరియన్ లేక పుస్తకాల గదికి తాళం
- దినపత్రికలే దిక్కు
- ఇబ్బంది పడుతున్న పాఠకులు

తాంసి: ప్రజలకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయం రేగ్యులర్ లైబ్రేరియన్ లేక నిరుపయోగంగా మారింది. పోటీ పరీక్షలు రాసే నిరుద్యోగ యువకులకు గ్రంథాలయంతో ఎలాంటి ప్రయోజం లేదు. మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయానికి గత కొన్నేళ్లుగా రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా గ్రంథాలయం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం లైబ్రేరీయన్ తాంసి గ్రంథాలయం ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. వారానికి ఒకసారి మాత్రమే వచ్చి వెళ్తున్నారు. దీంతో తాత్కాలికంగా పని చేసే అటెండర్ ప్రతీ రోజు గ్రంథాలయాన్ని తీస్తున్నాడు. పాఠకులకు కేవలం దినపత్రికలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. పోటీ పరీక్షలకు ఉపయోగపడే వార, మాసపత్రికలతో పాటు కాంపిటీషన్ పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాల గదికి తాళం..

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో యువకులకు, విద్యార్థులకు, పాఠకులకు విద్యపై అవగాహన పెంచడంతోపాటు, మంచి జ్ఞానాన్ని పెంచే విధంగా పుస్తకాలు ఉన్నాయి. వీటితోపాటు మహనీయుల జీవితాలకు సంబంధించిన విశేషాలు, జ్ఞానాన్ని అందించే వేలలో పుస్తకాలు ఉన్నప్పటికీ ఎవరికీ ఉపయోగపడటం లేదు. తమకు జ్ఞానాన్ని పెంచే పుస్తకాలు చదువుకోవాలని ఉన్నా.. పాఠకులు చదవలేకపోతున్నారు. లైబ్రేరియన్ లేక పుస్తకాలు ఉన్న గదికి ఏళ్ల తరబడి తాళం తీయడం లేదు.

ఇన్‌చార్జి లైబ్రేరియన్..

గ్రంథాలయానికి లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్న లైబ్రేరియన్‌కు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో కొన్నేళ్ల క్రితం ఇన్‌చార్జిగా విధులు అప్పగించారు. అప్పటినుంచి లైబ్రేరియన్ గతంలో ప్రతీనెల ఒకటి రెండుసార్లు వచ్చి వెళ్తున్నారు. ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ కేవలం గ్రంథాలాయానికి వచ్చే పేపర్ బిల్లులు, వార, మాసపత్రికల బిల్లులు అందించేందుకు, అటెండర్ జీతం ఇచ్చేందుకు మాత్ర మే ఇన్‌చారిజ లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో ఉంచాలని పాఠకులు కోరుతున్నారు.

లైబ్రేరియన్ నియమించాలి



గతంలో గ్రంథాలయానికి లైబ్రేరియన్‌గా ఉన్న అధికారిని జిల్లా కేంద్రంలో గ్రంథాలయానికి ఇన్‌చార్జిగా నియమించారు. లైబ్రేరియన్ లేక తాంసి గ్రంథాలయంలో తాత్కాలిక అటెండర్‌తోనే గ్రంథాలయాన్ని కొనసాగించాల్సిన పరిస్థితి.

– ప్రవీణ్, బీజేపీ మండల నాయకుడు

దినపత్రికలే ఉంటున్నాయి



గ్రంథాలయంలో దినపత్రికలు తప్పా పుస్తకాలు అందుబాటులో ఉండటం లేదు. జ్ఞానంతో పాటు కాలక్షేపం కోసం వివిధ పుస్తకాలను చదివేందుకు వస్తే పుస్తకాలు అందుబాటులో ఉండటం లేదు. పుస్తకాల గదికి ఎప్పుడు తాళం వేసి ఉంటుంది.

– సామ రాహుల్ రెడ్డి, తాంసి

జొన్న తరలించి సమస్య పరిష్కరిస్తాం

- డీఎం మార్క్‌ఫెడ్ ప్రవీణ్ రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..



మార్క్‌ఫెడ్ డీఎం, ఆర్ఎంలతో మాట్లాడుతున్న గ్రామస్తుడు

గుడిహత్నూర్: గోదాముల్లో నిల్వ ఉన్న జొన్నలను త్వరలో తరలించి సమస్య పరిష్కరిస్తామని ఆదిలాబాద్ డీఎం మార్క్‌ఫెడ్ ప్రవీణ్‌రెడ్డి, స్టేట్ వేర్ హౌస్ రీజినల్ మేనేజర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'పురుగులతో వేగలేం' కథనానికి స్పందించిన అధికారులు కొల్హారీ గ్రామానికి చేరుకుని గోదాముల్లో నిల్వ ఉన్న జొన్నను పరిశీలించారు. పురుగుల ఉధృతితో గ్రామస్తులు ఎదురుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత రెండు నెలలుగా పురుగుల వల్ల అవస్థలు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. సాక్షిలో వార్త రాగానే మీరంతా వచ్చారని లేకపోతే రాకపోయే వారని అన్నారు. సమస్యను పరిష్కరించకపోతే గ్రామస్తులమే వీటి బస్తాలను బయటకు తీసి కాల్చేస్తామని హెచ్చరించారు. అయితే వివిధ కారణాల వల్ల తరలించడంలో జాప్యం జరిగిందని, పురుగులు రాకుండా ఇప్పటికిప్పుడే మందుల పిచికారి చేపడతామన్నారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. డీసీఓ బి.మోహన్, వేర్ హౌస్ మేనేజర్ క్రాంతికుమార్, స్థానిక పీఏసీఎస్ సీఈవో పండరి ఉన్నారు.

ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి సహకరించండి



కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్, నాయకులు

నార్నూర్: వెనుకబడిన ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధికి సహకరించాలని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ కోరారు. మంగళవారం మండల పర్యటనకు వచ్చిన కేంద్ర బృందం ప్రతినిధులు మత్యుంజయ ఝా, శుభోద్ కుమార్‌తోపాటు కలెక్టర్ రాజర్షి షాలకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు, ఇక్కడి పరిస్థితులను వారికి వివరించారు. జిల్లాలోని వెనుకబడిన మండలమైన నార్నూర్‌లో ప్రభుత్వడిగ్రీ, సాంఘిక సంక్షేమ, మైనార్టీ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. సాగునీటి కోసం ఏంపల్లి, కొలందరి ప్రాజెక్టులు నిర్మించాలన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పూర్తిస్థాయి వైద్యులు నియమించాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేష్, మాజీ జెడ్పీటీసీ బిర్జులాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ షేక్ దాదేఅలీ, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి నాయక్, జేఏసీ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తమ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవరావు, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, కాంగ్రెస్ యువ నాయకుడు మహేందర్ ఉన్నారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి



ప్రథమ బహుమతి అందిస్తున్న రావుత్ మనోహర్

బేల: యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్ పేర్కొన్నారు. మండలంలోని చంపెల్లి గ్రామంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న జైజంగు జై లింగు కబడ్డీ ఫైనల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఫైనల్ పోటీల్లో గెలుపొందిన మహాకాళ్(ఇంద్రవెల్లి)జట్టుకు ప్రథమ బహుమతి రూ.30వేలు (మాజీ మంత్రి జోగు రామన్న), ద్వితీయ బహుముతి శివపూర్(మహారాష్ట్ర) జట్టుకు రూ.25వేల నగదును(అడనేశ్వర ఫౌండేషన్ చైర్మన్ సతీశ్ పవార్)ల తరపున ఆయన అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, నాయకులు దేవన్న, తేజ్‌రావు, కొడే విపిన్, జంగ్‌షా, సోనేరావు, భుజంగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పర్యటన జయప్రదం చేయాలి

- మాజీమంత్రి జోగు రామన్న



మాట్లాడుతున్న జోగు రామన్న

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని సీసీఐ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలనే డిమాండ్‌తో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి మద్దతు తెలిపేందుకు హాజరవుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం సీపీఎం కార్యాలయంలో సీసీఐ సాధన కమిటీ సభ్యులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 28న జిల్లా కేంద్రానికి వచ్చే జాన్ వెస్లీ పర్యటనకు వెయ్యిమందిని సమీకరించాలన్నారు. 200 బైక్‌లతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాలని కోరారు. ఏప్రిల్ 1న చలో ఢిల్లీ పేరిట వందమంది జిల్లా నుంచి తరలివెళ్లి జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలని కోరారు. ఉద్యోగ, విద్యార్థి, కార్మిక సంఘాల నాయకులను సమీకరించాలని, ఉద్యమ ఫొటో ఫ్లెక్సీలను పట్టణమంతా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీరోజు సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యచరణను సిద్ధం చేయాలని కోరారు. సీసీఐ సాధన కమిటీ కోకన్వీనర్ విజ్జగిరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లో న్యాయవాది ఎర్రబాపు ఇజ్రాయేల్ హత్యను నిరసిస్తూ మంగళవారం న్యాయవాదులు పట్టణంలో విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ మాట్లాడుతూ మహిళపై దాడి జరుగుతుంటే అడ్డుకున్నందుకు పోలీసు కేసు పెట్టించారని, కక్ష్య పెంచుకుని న్యాయవాది ఇజ్రాయేల్‌ను దస్తగిరి హత్య చేశారన్నారు. దాడుల నేపథ్యంలో ప్రభుత్వం న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకపోతే పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి ఉద్యమిస్తామన్నారు. న్యాయవాదులు సుధీర్, నారాయణ స్వామి, మహ్మద్ సాబిర్ ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ బార్‌అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. న్యాయవాదులు బాపురెడ్డి, ధీరజ్ గుప్తా, జగన్, అశోక్, గిరి పాల్గొన్నారు.

కుమురం భీం కాలనీని సందర్శించాలి



మాట్లాడుతున్న శంకర్

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టిసావర్గాం శివారు ప్రాంతంలో గల కుమురం భీం కాలనీని మంత్రి సీతక్క సందర్శించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. మంగళవారం కాలనీని సందర్శించిన ఆయన అక్కడ ఉన్న ఆదివాసీల పరిస్థితులపై ఆరా తీశారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కాలనీలోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ధర్నా చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, వివిధ సంఘాల నాయకులు వినోద్, అభిషేక్, వేణు, వికాస్, ఉయిక ఇంద్ర, లలిత, ఆత్రం భుజంగరావు, ఆత్రం గణపతి, సలాం వరుణ్, వెడ్మ ముకుంద్, వెట్టి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం

ఆదిలాబాద్‌టౌన్: పేద ప్రజల ఆకలి తీర్చడమే ధ్యేయంగా సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని శ్రీ యువశక్తి ఫౌండేషన్ చైర్మన్ రోహిత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేయాలనే లక్ష్యంతో తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గుండె వైద్యశిబిరానికి స్పందన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘంలో మంగళవారం నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు వృద్ధులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి ఆయుష్మాన్ భారత్, ఈహెచ్ఎస్ కింద వైద్యులు వైద్య సేవలందించేలా చూస్తామన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి వైద్యశిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

బైక్ యజమానిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బైక్‌కు ఫేక్ నంబర్ ప్లేట్ పెట్టిన చిచ్‌ధరి ఖానాపూర్‌కు చెందిన రాథోడ్ సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. బజాజ్ సిటీ 110 బైక్ వాహనానికి నంబర్ ఉండగా, వాహన పత్రాలు లేకపోవడంతో అనుమానం వచ్చి వివరాలు తెలుసుకోగా నంబర్‌ప్లేట్ ఫేక్ ఉన్నట్లు గుర్తించారు. బేల మండలానికి చెందిన వ్యక్తి బైక్ నంబర్ ప్లేట్‌ను ఇలా దుర్వినియోగం చేసి పెట్టుకున్నట్లు తెలిపారు. బైక్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై..

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ప్రభుత్వ పనుల నిమిత్తం ట్రాక్టర్‌లో ఇసుక తీసుకెళ్తుండగా సాంగ్వి వీడీసీ పేరిట డబ్బులు వసూలు చేసిన చక్రిపై కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. జైనథ్ మండలంలోని సాంగ్వి శివారు పెన్‌గంగా నుంచి ట్రాక్టర్ డ్రైవర్ ఇసుకను తీసుకెళ్తుండగా ఆయన వద్ద నుంచి రూ.300 బలవంతంగా వసూలు చేసినట్లు ట్రాక్టర్ డ్రైవర్ షఫీ, తహసీల్దార్ జె.నారాయణకు ఫిర్యాదు చేశారు. ఎవరైనా వీడీసీ కమిటీ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

శబరిమాత ఆలయ వార్షికోత్సవం



పల్లకి ఊరేగింపులో మౌనిష్ రెడ్డి

తలమడుగు: మండలంలోని పల్లి(కే) గ్రామంలో శబరిమాత ఆలయ 37వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయం నుంచి గ్రామ వీధులగుండా పల్లకి ఊరేగింపు నిర్వహించారు. సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి పాల్గొన్నారు. తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరంపూర్, రుయ్యాడి, అర్లి, దేవాపూర్, అదిలాబాద్ నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులు ఈశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌రెడ్డి, పాండు, రాంచందర్‌రెడ్డి, లింగారెడ్డి, స్వామి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలోని విద్యానగర్ సాయిబాబా ఆలయం ఐదో వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పూజార్లు ఓంప్రకాశ్, వీరయ్య ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

జంతర్‌మంతర్ ధర్నాలో నాయకులు



నిరసన తెలుపుతున్న రూపేష్‌రెడ్డి

కైలాస్‌నగర్/నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను పిలుపు మేరకు మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తానని చెప్పి ఇప్పటివరకు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు.

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ



జెండా వద్ద పూజలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బొక్కల్‌గూడలో మంగళవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేసి జెండాను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, పట్టణ ఇన్‌చార్జి మనోజ్, రాజలింగు, నాయకులు పాల్గొన్నారు.

పోషణ్ కిట్ సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అందిస్తున్న పోషణ్ కిట్‌తోపాటు ప్రతి నెల అందిస్తున్న రూ.వెయ్యిను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు పోషణ్ కిట్ పంపిణీ చేశారు. వైద్యుడు శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు సుంకట్ రావ్, ఎండీ జహిర్, వైద్యురాలు పూజిత ఉన్నారు.

మట్కా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

తాంసి: ఆన్‌లైన్ ద్వారా మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు తాంసి ఎస్సై రాధిక తెలిపారు. తాంసికి చెందిన చింతలవార్ శైలేష్ ఆర్గనైజ్‌గా మట్కా నిర్వహిస్తున్నాడని సమాచారం అందింది. అతన్ని అదుపులో తీసుకుని విచారించగా ఆన్‌లైన్ ద్వారా మట్కా నిర్వహిస్తున్నానని, నాతోపాటు పాండ్రకవడకు చెందిన అజ్జు భాయ్ ఉన్నాడని తెలిపాడు. నిందితుడు శైలేష్ నుంచి రూ.29,360 నగదు, ఒక సెల్‌ఫోన్, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన అక్కా చెల్లెళ్లు అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం ఉదయం 10 గంటలకు పరీక్ష రాయడానికి వెళ్తామని ఇంటి నుంచి వెళ్లారు. కాగా, వారి కుటుంబ సభ్యులు పనినిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల ఆమె ఆచూకీ దొరకకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఒక దేశం ఒకే ఎన్నికను ప్రోత్సహిద్దాం

ఇంద్రవెల్లి: ఒక దేశం ఒకే ఎన్నికను ప్రోత్సహిద్దామని నిర్మల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఒక దేశం..ఒకే ఎన్నిక ద్వారా దేశం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మాజీ జెడ్పీటీసీ అర్క పుష్పలత, బీజేపీ మండల అధ్యక్షుడు రాజలింగు, నాయకులు చంపత్‌రావ్, రాథోడ్ రాధిక, జగన్, శివకుమార్ జైస్వాల్, మస్కే రాజువర్ధన్, జైరాం పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక

బోథ్: మండల కేంద్రానికి చెందిన సహన్‌రెడ్డి మంగళవారం విడుదల చేసిన నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు సృజన-గంగారెడ్డి (కానిస్టేబుల్), గ్రామస్తులు అతన్ని అభినందించారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సర్‌షైన్ పాఠశాలకు చెందిన పాముల సిద్దార్థ, గౌతమ్‌కృష్ణ, చౌహాన్ పృథ్వీరాజ్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు.

బజార్‌హత్నూర్: మండలంలోని మోర్కండి గ్రామానికి చెందిన పాటిల్ షిలా, రాజారాం ల చిన్న కుమారుడు ధనుష్, దేగామ గ్రామానికి చెందిన కొక్కుల స్రవంతి, రాజేశ్వర్‌ల కుమారుడు అశ్రిత్ నవోదయ పరీక్షలో ప్రతిభ కనబర్చారు.

సన్మానం

బోథ్: మండల కేంద్రంలోని 5వ వార్డులో నీటి ఎద్దడి నెలకొంది. పంచాయతీ సహకారంతో గ్రామానికి చెందిన కల్లెం పోశెట్టి తన బోరు నుంచి నీళ్లు అందిస్తున్నారు. పోశెట్టిని కాలనీవాసులు సన్మానించారు.

యువకుడిని సన్మానించిన గ్రామస్తులు

తాంసి: ఆదిలాబాద్ మున్సిపల్‌లో టీపీబీవోగా ఉద్యోగం సాధించిన జిల్లా కేంద్రానికి చెందిన సాయికృష్ణను మంగళవారం పొన్నారి గ్రామస్తులు సన్మానించారు. హెచ్ఎం రాజశేఖర్, మాజీసర్పంచ్ అశోక్, మాజీ వైస్ ఎంపీపీ రఘు, ఉపాధ్యాయులు శిల్ప ఉన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆహ్వానం

బోథ్: మండలంలోని సాంగ్వి గ్రామస్తులు మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌ను నేరడిగొండలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ 2న జరిగే శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వసంత్ రావు, నాయకులు రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.